# కథ

**మండల కార్యాలయము నుంచి రెండు వందల గజాల దూరం నడిచి వెళ్తే వెటరినరీ హాస్పిటల్ గేట్. ఆస్పత్రి చుట్టూ విశాలమైన ఆవరణతో ప్రహరీ. ఎదుటగా నాలుగు వేప చెట్లు. నేను పని చేసినప్పుడు నాటిన మర్రి కొమ్మ పెరిగి పెద్దదవుతోంది. ఆస్పత్రి దగ్గర్లోనే అన్ని సదుపాయాలు గల క్వార్టర్.**

కాలచక్రం వేగంగా తిరిగిపోతున్నా మొన్న మొన్ననే ఇక్కడ పని చేసినట్టు పాత జ్ఞాపకాలు. వెళ్ళే సరికి. వాళ్ళే పాత అటెండర్స్! ఆప్యాయతగా ఎదురొచ్చి పలకరించారు. అక్కడి డాక్టరుగారు మీటింగ్ నిమిత్తము జిల్లా ప్రధాన కార్యాలయమునకు వెళ్లారట. కాంపౌండర్ పరిచయమున్నతనే. అప్పట్లో సర్వీస్‌లో కొత్తగా జాయిన్ అయి వుంటే, ఇప్పుడు కొంచెం బొజ్జ. అనుభవం పెరిగి రాటుదేలినట్టు కనిపిస్తున్నాడు. స్వంత పనిపై పరకాల వచ్చాను. ఒకసారి ఆస్పత్రి వైపు వెళ్లి చూసి వద్దామని వచ్చాను. లోపల గదిలో అప్పట్లో నేను వేసిన ఏరియా మ్యాప్ ఇంకా వుంది. కొద్దిపాటి మార్పులు తప్ప అలాగే వుంది. ఆస్పత్రి. ఎన్నిమార్లు ఆ గదుల్లో, ఆ చెట్ల క్రింద, ఆ దారివెంట తిరిగానో, ఉద్యోగ రీత్యా ఏదైనా ఒక చోట ఉంటం వీలుకాదు గదా! ఇక్కడి ఆస్పత్రి, చేతి నిండా పని, సదుపాయాలతో క్వార్టర్. అవసరమైతే ఒక పూటలో స్వగ్రామానికి వెళ్ళగల వీలు, మొత్తం మీద ఆ ప్లేస్ నాకు బాగా నచ్చేది. కానీ రెండు సంవత్సరాల కల్లా ఆస్పత్రి స్థాయి పెంచడమూ నాకు బదిలీ కావడం, క్రమేణా రెండు, మూడు చోట్ల తిరిగి ప్రస్తుతం వరంగల్‌కు రావడం, తిరిగి ఏడు సంవత్సరాల తర్వాత ఇలా పాత అడుగుజాడల్లోకి రావడం...

వచ్చిన పని ముగించుకుని సాయంత్రం తిరుగు ముఖం పట్టాను. బస్ స్టాండ్‌కు వచ్చేసరికి ప్యాసెంజర్ బస్సు రెడీగా వుంది. లోన సగం సీట్లు ఖాళీ వున్నాయ్. ఎక్కి కూర్చున్నాను. బస్సు బయలుదేరే సమయానికి జనం అట్నుంచీ, ఇట్నుంచీ వచ్చి ఎక్కారు. మొత్తం మీద సీట్లు మందం భర్తీ అయ్యింది. ప్రక్క రెండు సీట్లు సీటుపై ఇద్దరు కాలేజీ కుర్రాళ్ళు వచ్చి కూర్చున్నారు. ఇద్దరి చేతుల్లో హాకీ స్టిక్స్ వున్నాయ్. బస్సు కిటికీ గుండా బయటకు చూస్తున్నాను. ఆకు పచ్చని ఆకులు, పసుపు పచ్చని పెద్ద పూలతో పొద్దు తిరుగుడు చేలు, కనుల విందు చేస్తున్నాయి. రోడ్డు ప్రక్కన్నే ఈత చెట్లు. ఆ వెనకాల తాటి వనం. జనం అప్పుడే స్కూటర్లు, మోపెడ్స్, సైకిల్స్ ఆపుకుని కల్లు కొరకు చెట్ల నీడన నేలపై దస్తీలు పరుచుకుని కూర్చున్నారు. టౌన్ నుంచి గ్రామానికి వచ్చిన బంధువులకు కల్లంటే చాలా ప్రీతి. మాందారి పేట స్టేజీ దగ్గర బస్సు ఆగగానే పదీ, పన్నెండు మంది ఎక్కారు. కండక్టర్ సీటుపై నుండి లేచీ అప్పుడే ఎక్కిన ప్రయాణీకులను వెనక్కి పిలుచుకెళ్ళి వాళ్ళిచ్చిన చిల్లర డబ్బులు సంచీలో వేసుకుని, టికెట్ చీటీ వాళ్ళ చేతుల్లో కుక్కుతున్నాడు. మా ముందు సీటు ఒకటి ఖాళీ అవుతే ప్రక్క కుర్రాళ్ళు హాకీ స్టిక్ సీటుపై అలా పెట్టి ముందు ఎంట్రెన్స్ దగ్గర గేట్ కాపలా డ్యూటీ చేస్తున్న వాళ్ళ ఫ్రెండ్‌ని పిలుస్తున్నారు. "అరేయ్, ఇధర్ ఆవోరే, ఉదర్ క్యా కర్ రహా హై. ఏ సిటీ సమఝ్ రహా హై క్యా" ముందు ఒకరిద్దరు నిలబడి వున్న అమ్మాయిల వంక చూస్తూ అన్నారు. వాడు రాలేదు. వీళ్ళవైపు చూసి నవ్విండు. "ఆ వోబే... ఇదర్ సీట్ హై..!" ఇంతలో ఒక పల్లెటూరాయన ఆ ఖాళీ సీట్లో కూర్చోబోయాడు. 'ఏయ్! ఆగు. అగుపిస్తలేదా. మావోడస్తాడు" దబాయించిండు. పాపం ఆయన కూర్చోటానికి నడుం వంచిన వాడల్లా మారుమాట్లాడక నిటారుగ అయిండు. "క్యాబే, ఆతే నహీ" సీరియస్‌గా అన్నారు. వాడు గేట్లోనే మెట్లపై నిలబడి, పాన్ నములుకుంట మెడలు వెనక్కి తిప్పి సకిలించాడు. ఏమనలేదు. హాకీ స్టిక్ తీసి "కూచో బాస్. ఓ దీవానా నై ఆతా" పల్లెటూరాయన కూర్చున్నాడు. బస్సు ఇంకో పది కిలో మీటర్లు వెళ్ళి దొంగల సింగారం స్టేజీ దగ్గర ఆగింది. ఆ ధోతీ కట్టుకునే సర్పంచ్ ఎక్కుతాడే మోనని చూసినా లేదు. ఐదారుగురు ఎక్కిండ్రు. మూడు మాసాల పసిపాపను ఎత్తుకుని ఓ అమ్మాయి. లేడీస్ సీట్లల్లో ఖాళీ లేదు. కొంచెం వెనక్కి జరిగి వచ్చి నిల్చుంది. సీట్లు ఎక్కడా లేవు. మా ముందు సీట్లో ముగ్గురు ఆడవాళ్ళు కూర్చున్నారు. నా ప్రక్క నున్న పెద్ద మనిషి "చిన్న పిల్ల తల్లి. కొంచెం జరుగుండ్రి పాపం కూర్చుంటది" స్త్రీల నుద్దేశించి అన్నాడు. వాళ్ళు వినిపించనట్లే కూర్చున్నారు. జరుగలేదు. ఆమె మధ్యలో వుండే రాడ్ పట్టుకుని నిల్చుంది. పసివాని ముఖం మా వైపు. చామన ఛాయ. ముఖానికి పౌడర్ రాసి, నల్లని కాటుక బెట్టి, చెక్కిలిపై నల్లని చుక్క పెట్టింది. మ్యాచింగ్‌గా తెల్లని కుళ్ళ కట్టింది. నత్తా ముక్కు. మెరుస్తున్న చెంపలు. ఎవర్నో చూసి నవ్వుతున్నాడు. బస్సు కుదుపులకు ఆమె పిల్లవాన్ని ఎత్తుకుని బ్యాలన్స్ చేసుకోలేక పోతోంది. ఎవరూ లేచి సీటు ఆఫర్ చేయడం లేదు. లేచి సీటు ఇస్తే బాగుంటుందని పించింది. ముందు లేడీస్ కొంత అడ్జస్ట్ చేసుకుంటే సరిపోతుంది గదా. ఇంతలో రోడ్ టర్నింగ్, ఎదురుగా లారీ వచ్చింది.

సడెన్ బ్రేక్ వేసాడు డ్రైవర్. దాంతో ఆమె పసివానితో సరిగా బ్యాలెన్స్ చేసుకో లేక ముందుకు వెనక్కి ఊగిసలాడి, రాడ్ చుట్టూ మెలికల్లా తిరిగింది. అయినా ఎవరూ సీట్ ఆఫర్ చేయలేదు.



# కేరటాలు

—బీరా సుధాకర్ రెడ్డి

ఎవరూ గమనించడం లేదా! లేక, గమనించీ గమనించనట్లు మిన్నకుంటున్నారా! లేచి సీటిస్తే పోతుంది. ఇద్దామా... వద్దా, ఎవరైనా ఇవ్వక పోతారా... తటపటాయింపు. ఇంకా వరంగల్ ఎంత దూరం. ఆలోచన. "ఇటు రామ్మా, ఇక్కడ కూర్చో" అంటూ ప్రక్క హాకీ స్టిక్ కుర్రాడు లేచాడు. అతని ఫ్రెండ్ కూడా లేచాడు. ఇద్దరూ వెనక్కు వెళ్లారు. ఆ అమ్మాయి, ఇంకో పెద్దమ్మ వచ్చి సీట్లలో కూర్చున్నారు.

సీట్ ఇద్దామా, వద్దా అనుకునే నాలాంటి 'డేటింగ్-థామస్'ల కన్నా కేరటాల్లాంటి ఈ యువకులే నయం. తోచింది. మాట్లాడ్తారు, చేస్తారు. మంచా? చెడా? నిమిత్తం లేదు.